క్లుప్తంగా

28న శ్రీ అనంత పద్మనాభుని కల్యాణోత్సవం

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని పాత కడపలోగల శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ.శ్రీధర్, ధర్మకర్త కె.సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్‌లు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 7.00 గంటలకు స్వామి మూలమూర్తికి విశేష అభిషేకం, 8.30 గంటలకు విశేష అలంకారం, సర్వ దర్శనం ఉంటాయన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామని, 12.30 గంటలకు మహా మంగళహారతి, ప్రసాద వితరణ, అనంతరం అన్నదానం ఉంటాయన్నారు. సాయంత్రం 7.00 గంటలకు పాత కడప వీధుల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులకు ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

అన్నదానం

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని చౌడేశ్వరీ వృద్ధుల ఆశ్రమంలో సోమవారం శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంస్థ ప్రతినిధి కాకేటి చెంగయ్య, బుజ్జమ్మ కుమారుడు శశిప్రీతమ్‌లు కార్యక్రమానికి అతిథులుగా హాజరై తమ ఇంట జరుగుతున్న శుభ కార్యాలను వృద్ధుల సమక్షంలో నిర్వహించి వారి ఆశీస్సులు పొందేందుకు అవకాశంగా భావించామన్నారు. కార్యక్రమంలో గ్లోరీ సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధి మునెయ్య, జ్యోతి జార్జి, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై చైతన్యం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్. సునీత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించి స్వచ్ఛతా కార్యక్రమాల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని పేర్కొన్నారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని పరిసరాలను శుభ్రం చేశారు.

27న పర్వతారోహకుల పరిచయం

కడప కల్చరల్ : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఇద్దరు పర్వతారోహకుల పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వైవీయూ వీసీ ఆచార్యచింతా సుధాకర్ ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ ఆచార్యవైపీ వెంకట సుబ్బయ్య విశిష్ఠ అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా పర్వతారోహకులు వి.శ్రీలత, జి. సురేష్‌బాబులను పరిచయం చేస్తామన్నారు.

చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్: నెల్లూరు నగరంలో నిర్వహించిన వై.వి.ఆర్ మెమోరియల్ జాతీయస్థాయి చదరంగం పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన క్రీడాకారులు రాణించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. ఈనెల 24న నిర్వహించిన పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన రేటింగ్ క్రీడాకారిణి సజ్జోత్సన అండర్–15 బాలికల విభాగంలో ప్రథమస్థానం, కడపకు చెందిన జ్యోతి రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా అండర్–11 బాలికల విభాగంలో కడపకు చెందిన చిన్మయి రెండోస్థానం, అండర్–11 బాలుర విభాగంలో ప్రదీప్‌చంద్రారెడ్డి 4వ స్థానం, అండర్–7 విభాగంలో కడపకు చెందిన అమీనా 4వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన ఆశా విజయలక్ష్మి కుటుంబానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అండగా నిలిచారు. గత నెల 30వ తేదీన యూనివర్సిటీ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆమె మృతి చెందడంతో మానవతా దృక్పథంతో కళాశాల అధ్యాపకులు రూ.63,216 ఆర్థికసాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఏపీ ఫార్మా జేఏసీ ఆధ్వర్యంలో వరల్డ్ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం జేఏసీ కార్యాలయంలో సీనియర్ ఫార్మాసిస్ట్‌లు బాలక్రిష్ణ, ఉమామహేశ్వర్, ఎంవీ చలపతిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ మద్దెల సురేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణలోగానే ఏపీలో కూడా పీసీఐ ఎన్నికలు జరపాలన్నారు. ఆగిపోయిన రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రతి ఫార్మాసిస్టుకు సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలన్నారు.

నగరంలో జోరు వాన



కడప నగరంలో జలమయమైన రహదారి

కడప కార్పొరేషన్: పగలంతా ఉక్కపోతకు గురిచేస్తున్న వాతావరణం రాత్రయ్యే సరికి వాన కురుస్తోంది. కడప నగరంలో ఆదివారం రాత్రి కూడా భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు నిరంతరాయంగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ముఖ్యంగా నగర నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండు వద్ద, తేజ పెట్రోల్ బంకు నుంచి వై జంక్షన్ మీదుగా మినీ బైపాస్‌లో రహదారులపై భారీ స్థాయిలో వరద నీరు నిలిచింది. ఫక్కీరుపల్లెకు పోయే మార్గం నుంచి మినీ బైపాస్ మొత్తం నీటితో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు అవస్థలు పడ్డారు. ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం, జిల్లా కోర్టు వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. వినాయక నగర్ కూడలిలో కూడా పెద్ద మొత్తంలో వర్షపునీరు నిలిచింది. నగరంలోని మురికి కాలువలు, వరదనీటి కాలువలు పొంగి ప్రవహించాయి. ఎస్‌బీఐ కాలనీ, గంజికుంట కాలనీ, ప్రకాష్‌నగర్, గోకుల్ సర్కిల్, గౌస్ నగర్, అక్కాయపల్లె, నంద్యాల నాగిరెడ్డి కాలనీ, రామరాజుపల్లె తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. కూరగాయల మార్కెట్‌లో నీరు, బురద నిలవడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులు, గాలులు వీచడం వల్ల పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఆర్టీసీ బస్టాండు జలమయం



కడప కోటిరెడ్డిసర్కిల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండు ప్లాట్‌ఫాం వద్ద నిలిచిన వర్షపు నీటితో కడప నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు, ఇతర ప్రాంతాల నుంచి కడపకు వస్తున్న ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజంతా నిలబడిన వర్షపు నీటిని దాటుకునేందుకు వృద్ధులు, మహిళలు, చిన్నారులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇబ్బందులు తప్పడం లేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

వరదనీరు సజావుగా వెళ్లేందుకు ప్రణాళికలు

కడప కార్పొరేషన్: వరదనీరు సజావుగా వెళ్లేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన అప్సర కూడలి, ఎన్‌జీవో కాలనీ, భగత్ సింగ్ నగర్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్సర కూడలి వద్దనున్న డ్రైనేజీ కాలువను మరింత విస్తరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లోని పూడికను వెంటనే తొలగించాలన్నారు. ఎన్‌జీవో కాలనీలో తగ్గుగా ఉన్న రోడ్లపై సింగిల్ లేయర్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. గురుకుల్ విద్యాపీఠ్ వద్ద నిల్వ ఉన్న నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వరదనీటి ప్రవాహానికి ఎక్కడైనా అడ్డంకులు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. రోడ్లపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌జీవో కాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలి

కడప కార్పొరేషన్ : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలకు తగిన పరిష్కారం చూపాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 53 అర్జీలు రాగా, టౌన్‌ప్లానింగ్–14, ఇంజినీరింగ్–21, రెవెన్యూ–4, పబ్లిక్ హెల్త్–5, యూపీఏ విభాగం–3, కడప తహసీల్దార్–2, ఏపీఎస్‌పీడీసీఎల్–1, హౌసింగ్–3 అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్పిరిట్ విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: అనంతపురం జేఎన్‌టీయు విడుదల చేసిన నాల్గవ సెమిస్టర్ ఎంసీఏ, ఎంబీఏ ఫలితాల్లో కడప రిమ్స్ రోడ్డులో గల స్పిరిట్ ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఇందులో ఎంసీఏ విభాగంలో అఖిల, వీణ ప్రైసీ, సుప్రజ కళాశాలల ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానంలో నిలిచారు. అలాగే ఎంబీఏ విభాగంలో వేదశ్రీ, సుమలత, విష్ణుప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కళాశాల అధినేత నిర్మల, సంచాలకులు రవీంద్ర అభినందనలు తెలిపారు.

జూదరుల అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం పాలకొండలు సమీపంలో జూదమాడుతున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు....కడపకు చెందిన ఇరువురు సోమవారం పాలకొండలుకు సమీపంలో జూదమాడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువురిని అరెస్టు చేసి రూ. 11.340 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ప్రకాశ్‌నగర్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వే కడప నగరంలో ముమ్మరంగా కొనసాగుతోంది. సోమవారం నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా ఏడు రకాల పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. షుగర్, బీపీ, రక్తపరీక్షలు, మలేరియా, డెంగీ, గళ్ల పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రజలు ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న వైద్య శిబిరాల్లో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం కళావతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

వీరపునాయునిపల్లె: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ వీరపునాయునిపల్లె సెక్టార్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులకు 18 సంవత్సరాలు, యువకులకు 21 సంవత్సరాలు పూర్తయినంత వరకు వివాహాలు చేయకూడదన్నారు. చట్ట విరుద్ధంగా బాల్య వివాహం నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయసంపల్లె సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, పాఠశాల ఉపాధ్యాయులు చెన్నక్రిష్టారెడ్డి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



కడప స్పోర్ట్స్: దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌వైకే అధికారులు



కడప కోటిరెడ్డిసర్కిల్ : దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కడప స్పోర్ట్స్: కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ మాట్లాడుతూ వ్యక్తి వికాసం, సమాజహితం, విశ్వ మానవ కళ్యాణమే లక్ష్యంగా ఏకాత్మ మానవవాదం ప్రతిపాదించిన గొప్ప నాయకుడు దీన్‌దయాళ్ అని పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా, పత్రికా సంపాదకునిగా, దేశాన్ని జాగృతం చేశారని కొనియాడారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేటి యువత దేశభక్తిని పెంపొందించుకుని దేశానికి తన వంతుగా సేవలు అందించాలని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో దీన్ దయాళ్ జయంతి సందర్భంగా డీడీయూ జీకేవై పథకంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కలిసి ఆయన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుబ్బరామిరెడ్డి, వారిస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– మహోన్నత వ్యక్తిత్వంగల దీన్ దయాళ్ ఉపాధ్యాయను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు లక్ష్మణ్‌రావు తెలిపారు. దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకుని కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్ గారు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్యాణ్, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ మునగా సతీష్, ఇతర నేతలు కృష్ణారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సహకార నిర్వహణ సంస్థ అధికారి శ్రీనివాస్

కడప అగ్రికల్చర్ : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయడానికి అధికారులు కృషి చేయాలని హైదరాబాద్ సహకార నిర్వహణ సంస్థ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకార మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాల విస్తరణ దిశగా సహకార సంఘాలు– అవగాహన సదస్సులులో భాగంగా కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లాలోని బలహీనమైన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సభ్యులు, కమిటీ సభ్యులు, సహకార సిబ్బందితోపాటు డీసీసీబీ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బలహీనమైన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, కమిటీ సభ్యులు ప్రత్యేక బాధ్యతలు తీసుకుని సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ సిబ్బంది, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వివిధ సంఘాల ఉపాధ్యాయులు

కడప సెవెన్‌రోడ్స్ : సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మదన్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని తీసుకువస్తూ మంత్రి మండలి సమావేశంలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ.. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉపాధ్యాయులు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు కార్యాలయం లోనికి చొచ్చుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు తోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పలువురు ఉపాధ్యాయ నాయకులను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాం సుందర్‌రెడ్డి, ఫోర్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకాల్ కొండయ్య, ఫ్యాప్టో ట్రెజరర్ వెంకట సుబ్బయ్య, ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర నాయకులు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఓపీఎస్ కోసం పలు ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమానికి పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్ బాబు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరాంజులురెడ్డి, అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటిలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరంగనాథుడు గజ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణ రాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోండి

గోపవరం : రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. డివిజన్ పరిధిలోని బద్వేలు, సిద్దవటం, అట్లూరు, గోపవరం మండలాలకు సంబంధించి వర్షపాతం, పంటల వారీగా సాగు విస్తీర్ణం, రైతుభరోసా కేంద్రాల సేవలు, ఈ–పంట నమోదు, ఎరువులు తదితర అంశాలపై వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున ఇప్పటి వరకు ఆశించిన పంటలు రైతులు సాగు చేయలేదని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ సలహాదారులకు వివరించారు.

అక్టోబర్ 1 నుండి రబీ సీజన్ ప్రారంభమవుతున్నందున చిరుధాన్యా ల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు విజ్ఞప్తి చేశారు. చిరుధాన్యాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించిన విషయాన్ని వివరించి పంటలు సాగు చేసేవిధంగా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు.

వైభవంగా గంధం మహోత్సవం

సిద్దవటం : మండల కేంద్రం పరిధిలోని ఎగువపేటలో ఉన్న ఫత్తుమియ్యా దర్గాలో మిలాద్–ఉన్–నబి సందర్భంగా సోమవారం గంధం మహోత్సవాన్ని నిర్వహించినట్టు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ గంధంను ఆసారే షరీఫ్ ఇంటి వద్ద నుంచి మేళతాళలతో ఊరేగింపుగా దర్గాకు చేరిందన్నారు. అక్కడ గంధంను ఫతేహా నిర్వహించామన్నారు. మంగళవారం ఉరుసు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శిస్తారని అన్నారు. ప్రశాంత వాతావరణంలో జరిగే ఉరుసు మహోత్సవానికి భక్తులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

అఖండ రామనామ సంకీర్తన చేయాలి

ఒంటిమిట్ట : ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, రైతులు పాడిపంటలతో ఆనందంగా ఉండేందుకు అఖండ రామ నామ సంకీర్తన చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర్ స్వామి కోరారు. సోమవారం మండల కేంద్రంమైన ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద జానపద గురువులు, భజన బృంద లీడర్లతో విజయ శంకర్ స్వామి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 19, 20వ తేదీలలో ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో అఖండ రామనామ సంకీర్తన చేయాలని నిర్ణయించారు. ఈ రామనామ సంకీర్తన యజ్ఞంలో అందరూ పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరారు.

ఘనంగా పవిత్రమాలల సమర్పణ

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామి పవిత్రోత్సవాలను పురస్కరించుకొని సోమవారం సౌమ్యనాథుడికి పవిత్రమాలల సమర్పణను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి, సౌమ్యనాథుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలతో మాలలను అలంకరించారు. అంతకముందుగా ఉత్సవమూర్తులకు అభిషేకం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, టీటీడీ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాపాఘ్నికి జల కళ

కమలాపురం: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కమలాపురం పాపాఘ్ని నది జల కళను సంతరించుకుంది. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో కమలాపురం మండలంలో 55.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు. కాగా గత రెండు రోజులుగా పై ప్రాంతాలతో పాటు మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పాపాఘ్ని నదికి వరద నీరు వచ్చి చేరింది. అలాగే పంట పొలాల్లో, కాలువల్లో, వంకల్లో వరద నీరు ప్రవహించింది.

అలాగే కమలాపురం పట్టణంలోని క్రిష్టానగర్, మారుతి నగర్, రామ్‌నగర్ తదితర కాలనీలన్నీ జలమయమయ్యాయి. పాదచారులు, స్థానికుల రాక పోకలకు తీవ్ర ఇబ్బంది జరిగింది. కాగా సి.గోవులాపురం – పాచికలపాడు గ్రామాల మధ్య ఉన్న వంక ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కోవిడ్–19లో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. పీహెచ్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, అడిషనల్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. తిరుపాల్, వి. శ్రీధర్‌బాబు, జి. బాలాజీ, గోపి, పెద్దన్న, పెంచలయ్య, నరసింహులు, ఆనంద్, శివ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ నేతలు రాక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం జిల్లాకు రానున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి జంగా గౌతమ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి కడపకు చేరుకుని రాబోయే సార్వత్రిక ఎన్నికలకుగాను జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తారన్నారు.

హోండా ఎస్‌పీ162 వాహనం మార్కెట్‌లోకి విడుదల



హోండా ఎస్‌పీ 162 వాహనాన్ని ఆవిష్కరిస్తున్న కంపెనీ ఏరియా మేనేజర్ హర్ష

కడప కార్పొరేషన్: హోండా మోటారు వాహనాల కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన హోండా ఎస్‌పీ 162 కడప మార్కెట్లోకి విడుదలైంది. సోమవారం స్థానిక ఐటీఐ కూడలిలోని వీకే హోండా షోరూంలో ఆ కంపెనీ ఏరియా ఇన్‌చార్జి హర్ష శాన్ చేతులు మీదుగా వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంఎస్ఐ 162 సీసీ సెగ్మెంట్‌లో ఎస్పీ 160సీసీ వాహనం మార్కెట్‌లోకి లాంచ్ అయ్యిందన్నారు. ప్రస్తుతం ఉన్న వాహనాలకు ఇది గట్టి పోటీ ఇవ్వనుందని తెలిపారు. షోరూం జనరల్ మేనేజర్ ఎంవీఎస్ వర్మ మాట్లాడుతూ ఈ బైక్‌లో ఫుల్ డిజిటల్ ఎల్‌సీడీ, ఇన్‌స్ట్రూమెంట్ కన్సాల్, స్పీడ్ మీటర్, ఓడ్ మీటర్, ఫ్యూయల్ గేజ్ గేర్ పొజిషన్, ఇండికేటర్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం అధ్యక్షుడు డా. శివానాయక్

కడప కార్పొరేషన్: జిల్లాలలో ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివానాయక్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ శిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని ప్రజలకు 7 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందజేస్తారన్నారు. 'ఆరోగ్య సురక్ష' శిబిరాల్లో పరిష్కారం కాని వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా పెద్ద హాస్పిటల్స్‌కు పంపి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తారన్నారు. రిమ్స్ హాస్పిటల్‌లో ఎంఆర్ఐ స్కానింగ్, ఇతర విభాగాలు బాగా పనిచేస్తున్నాయని అన్నారు. నగర అధ్యక్షుడు డా. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో 'పెడల్ ఫర్ ఫ్రీడమ్'



ఆర్ట్స్ కళాశాలలో సైకిల్‌యాత్ర చేపట్టిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపాల్స్

వైవీయూ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో సోమవారం వేర్వేరుగా 'పెడల్ ఫర్ ఫ్రీడమ్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్య కమిషనరేట్, రెడ్‌రోప్ స్వచ్ఛంద సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పెడల్ ఫర్ ఫ్రీడమ్–23 పేరుతో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషాలు విచ్చేసి మాట్లాడుతూ లింగ సమానత్వం, మహిళల అక్రమ రవాణా, కౌమార దశ అన్న అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. రెడ్‌రోప్ కోఆర్డినేటర్ క్రిసోలైట్ మార్గదర్శనంలో కళాశాలల విద్యార్థులు వందలాది కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అవగాహన కల్పించడం గొప్పవిషయమన్నారు.